క్లుప్తంగా

మధ్యాహ్న భోజన పథకం తనిఖీ



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

దొరవారిసత్రం: వేణుంబాకం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం అమలు తీరును గురువారం ఎంఈఓ కృష్ణయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలసి భోజనం చేశారు. అనంతరం పాఠశాలలోని వివిధ రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందేలా ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు బాధ్యతగా చూసుకోవాలన్నారు.

నేడు ఆలయ పాలక మండలి సమావేశం

చిట్టమూరు(చిల్లకూరు): చిట్టమూరు మండలంలోని మల్లాం గ్రామంలో వెలసియున్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామివారి ఆలయ కమిటీ సమావేశాన్ని శుక్రవారం ఆలయంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చిల్లకూరు సాయికుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. ఆలయం వద్ద ఆయన మాట్లాడుతూ పాలక మండలి ఏర్పడి రెండేళ్లు పూర్తి కావస్తున్న క్రమంలో కమిటీ సభ్యులతో కలసి చివరి సమావేశం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కమిటీ సభ్యులతోపాటుగా తమపై అభిమానం ఉన్న ప్రతి ఒక్కరు ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ స్వప్న

ఓజిలి: నూతన ఎస్‌ఐగా కె.స్వప్న గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఓజిలి ఎస్‌ఐగా పనిచేస్తున్న రవిబాబును తిరుపతి వీఆర్‌కు పంపి, వీఆర్‌లో ఉన్న స్వప్నను ఓజిలికి బదిలీ చేశారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐకు సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. నాయకులంతా సహకరించాలని కోరారు.

కండలేరులో 6.438 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 6.438 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 2450 క్యూసెక్కుల నీరు చేరుతోందని తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 165, లోలెవల్ కాలువకు 20, హైలెవల్ కాలువకు 130 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఓజిలి: మండలంలోని పెదపరియ నెల్‌క్యాస్ట్ పరిశ్రమలోని కార్మికులకు కిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యులు రవికుమార్, హేమంత్, శ్రీనివాసులునాయుడు, సత్యశ్రీ 350 మంది కార్మికులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి, జీఎం మోగుఓషరన్, సిబ్బంది శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో నేడు పుష్పయాగం

సూళ్లూరుపేట: శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి పుష్పయాగం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఈఓ శ్రీనివాసబాబు తెలిపారు. అత్యంత వైభవంగా నిర్వహించే పుష్పయాగానికి భక్తులందరూ విచ్చేసి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



దీవడ్డిపల్లిలో ఊరేగింపు

డక్కిలి: మండలంలో గత నాలుగు రోజులు నుంచి నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకలు గురువారం డి.వడ్డిపల్లి గ్రామంలో వైభవంగా ముగిశాయి. మధ్యాహ్నం 2 నుండి 5 గంటలు వరకు శ్రీకృష్ణ ప్రతిమ ఊరేగింపు చేపట్టారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు టి.వెంకటేశ్వర్లు, పెంచలనరసయ్య, పెంచలరెడ్డి, ప్రసాద్, కార్తీక్, పెంచలస్వామి, నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో జాతీయ క్రీడా దినోత్సవం

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ కళాశాలలో ఐఎస్టీలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు. విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహించారు. విజేతలకు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థులు ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకుని చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీడీ మల్లికార్జున్‌రెడ్డి, శోభారాణి పాల్గొన్నారు.

వేధింపుల నిరోధక కమిటీలు అవసరం



వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి. కోల్‌కతా వైద్యురాలి ఘటనలో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను తక్షణం అమలు చేయాలి. అలాగే వేధింపుల నిరోధక కమిటీని తక్షణం ఏర్పాటు చేయాలి. వీటన్నింటితోపాటు జిల్లా స్థాయిలో అధికారులు, వైద్యాధికారులు, పోలీసు అధికారులు, జూనియర్ డాక్టర్లు, మహిళ వైద్యులతో ప్రతి ప్రభుత్వాస్పత్రిలో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలి. ప్రతి నెలా ఈ కమిటీ సమావేశమై డాక్టర్ల భద్రత సౌకర్యాలపై చర్చించి, వాటిని అమలు చేసేలా ఉండాలి. కోల్‌కతా లాంటి ఘటనలు ఇక పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకురావాలి. – డాక్టర్ విజయ్‌కుమార్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, నాగలాపురం



మనోధైర్యం కల్పించాలి



ఆస్పత్రుల్లో రాత్రింబవళ్లు వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బందికి భద్రత తప్పనిసరిగా కల్పించాలి. సుప్రీంకోర్టు సూచన మేరకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టి వైద్య సిబ్బందికి మనోధైర్యం కల్పించాలి. ఆస్పత్రుల్లో సెక్యూరిటీ గార్డ్‌లను నియమించి, అనుమానాస్పద వ్యక్తులు, మద్యం సేవించిన వారిని గుర్తించి తగు చర్యలు చేపట్టాలి. ఆస్పత్రుల్లో సంబంధిత పోలీస్ స్టేషన్లు, ఇతర హెల్ప్‌లైన్ నంబర్లు బోర్డుపై ఏర్పాటు చేయాలి. కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. – డాక్టర్ అరుణ్ కిషోర్, వైద్యాధికారి, నాగలాపురం పీహెచ్‌సీ

దేశ భాషలందు తెలుగు లెస్స



చిల్లకూరు: చింతవరంలో అక్షర రూపంలో విద్యార్థులు





చిల్లకూరు: చింతవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పుస్తక పఠనం, కోలాటం ఆడుతున్న విద్యార్థినులు

చిల్లకూరు: దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయులు పలికాడని చింతవరం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శివసుబ్రహ్మణ్యం అన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం మండలంలోని వివిధ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. చింతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తెలుగు పుస్తకాలను పరిచయం చేశారు. రేస పాఠశాలలో విద్యార్థులు అ, ఆ అక్షర రూపంలో అందరినీ అలరించారు. పారిచెర్లవారిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు ప్రజేంద్రరెడ్డి ఆధ్వర్యంలో తెలుగు భాషకు గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషిని తెలియజేశారు. విద్యార్థులు తెలుగు నాయకుల వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈఓ ఎండీ రవూఫ్, ఆదిలక్ష్మి, వేణుగోపాల్‌రెడ్డి, మాధవయ్య, కామేశ్వరి, చంద్రశేఖర్, కుమార్, ఏలియా, బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్టమూరులో...

చిట్టమూరు మండలంలోని కొత్తగుంట గ్రామంలోని టీఎంఆర్ పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయులు తదితర వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు భాష పై పట్టు సాధించాలని అన్నారు. ఆంగ్లంపై మోజుతో తెలుగులోని కమ్మదనాన్ని మరచి పోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

వెంకటగిరి రూరల్: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంకటగిరిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్, బంగారుపేట ప్రాథమికోన్నత పాఠశాల, బాలికల గురుకుల పాఠశాల, కలపాడు ప్రాథమిక పాఠశాలలో వేడుకలు చేపట్టారు. తొలుత విద్యార్థులు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. అనంతరం తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలపై విద్యార్థుల వేషధారణలతో అవగాహన కల్పించారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని వీఎస్‌ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు 161వ జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెలుగు విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకరశర్మ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెనాలికి చెందిన విశ్రాంత తెలుగు ప్రొఫెసర్ మొవ్వ వృషాద్రిపతి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తెలుగు కవిత్వాలు, సామెతలు గురించి, తెలుగు గొప్పదనాన్ని గురించి విద్యార్థులకు వివరించారు. తెలుగు శాఖాధిపతి పి.ఏడుకొండలు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీవిద్యార్థులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

మన్నారుపోలూరులో..

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని మన్నారుపోలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా తెలుగు భాష ప్రాముఖ్యతను తెలియజేశారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తెలుగు భాష దినోత్సవం సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో కోలాటం ఆడారు.

రాపూరులో..

రాపూరు: మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం తెలుగుభాషా దినోత్సవ, జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులతో అలరించారు. వివిధ రకాల సాంప్రదాయ వంటకాలను ప్రదర్శించారు. తొలుత గిడుగు రామ్మూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళుర్పించారు. ఆటల పోటీల్లో విజయం సాధించిన చిన్నారులకు బహుమతులు అందించారు. పీడీ విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్: గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం తెలుగు భాష దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎల్‌ఏ సాగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు అన్నామణి అధ్యక్షతన తెలుగు పండితులు గడదాసు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయల సారథ్యంలో విద్యార్థులతో వేడుకలు నిర్వహించారు. బాలికల గురుకులంలో విద్యార్థినులు రాసిన బాల గేయాల పుస్తకాలను ఆవిష్కరించారు.



రాపూరు బాలికల ఉన్నత పాఠశాల్లో సాంప్రదాయ దుస్తులతో చిన్నారులు



నాయుడుపేట ఎల్‌ఏ సాగరం ఉన్నత పాఠశాలలో...



చిల్లకూరు: చిట్టమూరులోని టీఎంఆర్ పాఠశాలలో విద్యార్థుల వేషధారణ



చిల్లకూరు: పారిచెర్లవారిపాళెం జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయుడికి సత్కారం



తెనాలి రిటైర్డ్ తెలుగు ప్రొఫెసర్ మొవ్వ వృషాద్రిపతిని సత్కరిస్తున్న అధ్యాపకులు

ఉచిత కంటి వైద్య పరీక్షలు



కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బాలాయపల్లి(సైదాపురం): బాలాయపల్లి మండలంలోని జయంపు గ్రామంలో చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు సహకారంతో తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ వైద్యశాల ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీశంకర్, సీఈఓ సీతారామనాయుడు మాట్లాడుతూ అనుభవం కలిగిన కంటి వైద్యులు అర్చన, కీర్తి 175 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో 40 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించగా 35 మంది రోగులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఏఓ కృష్ణగల్లా, సిబ్బంది దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే హెల్ప్‌లైన్ నంబర్

సూళ్లూరుపేట: మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో ఎక్కడైనా సమస్యలున్నా పాలకమండలికి తెలియజేసేందుకు హెల్ప్‌లైన్ నెంబర్‌ను పునరుద్ధరించామని కమిషనర్ చెల్లు గంగాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ ఎలాంటి సమస్యలున్నా ప్రజలే స్వయంగా మున్సిపాలిటీ దృష్టికి తీసుకొచ్చేందుకు 82976 22273 నెంబర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. అయితే గతంలో ఈ హెల్ప్‌లైన్ నెంబర్ ఉన్నప్పటికీ మధ్యలోనే దీన్ని ఆపేశామని, ఇప్పుడు సమస్యలను నేరుగా మా దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించే దిశగా ఈ నెంబర్‌ను మళ్లీ పునరుద్ధరించామని తెలిపారు. పరిష్కరించదగిన సమస్యలను తీసుకొస్తే కచ్చితంగా స్పందిస్తామని ఆయన తెలియజేశారు.

ఓపీ సేవలు పెంచాలి

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా ఓపీ సేవలను పెంచుకోవాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృంద సభ్యులు, డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు వైద్యులకు సూచించారు. పట్టణంలోని తుమ్మూరు అర్బన్ హెల్త్ క్లినిక్‌లో గురువారం వివిధ విభాగాల అధికారులతో తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స చేసుకునేందుకు వచ్చినవారితో మాట్లాడి వైద్య సేవల వివరాలను ఆరా తీశారు. అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో ఉన్న ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు తదితర సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ తనిఖీలలో ఎస్ఓ సి.నాగేంద్ర కుమార్, డీపీహెచ్ఓ ఎం.బేబిరాణి, డీపీఓ పి.ప్రకాష్, హెల్త్ సూపర్‌వైజర్ పి.నరేష్ బాబు, సంపూర్ణమ్మ, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ జీఎం షఫీఉల్లా తదితరులు ఉన్నారు.

ఎస్ఎంసీ సభ్యులకు అవగాహన

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని 78 పాఠశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు గురువారం సంఘమిత్ర కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈఓ మునిరత్నం ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, తదితర విషయాలపై కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యాక్షులకు వివరించారు. పాఠశాలలో చేపట్టే నూతన విద్యావిధానాలు, మధ్యాహ్న భోజన పథకం తదితర విషయాలపై కమిటీలకు అవగాహన కల్పించారు.

నాగిరెడ్డికి ఘననివాళి



నాయుడుపేట టౌన్: జువ్వలపాళెంకు చెందిన ఏఎంసీ మాజీ డైరెక్టర్ నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సోదరుడు, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటనారాయణరెడ్డి చిత్రపటానికి సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఘనంగా నివాళులర్పించారు. జువ్వలపాళెం గ్రామంలో గురువారం నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, ఓజిలి వైఎస్ఆర్ సీపీ కన్వీనర్ పాదర్తి హరినాథ్‌రెడ్డి, నాయకులు ఓటూరు రాధాకిషోర్ యాదవ్, కలికి మాధవరెడ్డి, అనిల్‌రెడ్డి, షేక్ రహమతుల్లా, ముత్యాలరెడ్డి, బాలు తదితరులు న్నారు.

లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని పలు లాడ్జీలలో గురువారం రాత్రి అర్బన్ సీఐ బాబీ పోలీసులతో కలసి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న ఓ లాడ్జిలో యువతిని పెట్టుకుని అసాంఘిక కార్యక్రమాలు చేస్తుండడంతో యజమానిపై అదుపులోకి తీసుకుని విచారించారు. లాడ్జిలలో బస చేసే ప్రతి ఒక్కరి పూర్తి చిరునామాతో పాటు ఆధార్ కార్డులను తప్పనిసరిగా తీసుకోవాలని, అనుమానితులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

రహదారిపై ప్రత్యేక నిఘా

దొరవారిసత్రం: జాతీయ రహదారిపై ప్రత్యేక నిఘా పెట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ జి.అజయ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గంజాయి, ఇసుక, కోడి పందాలు, పేకాట వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి, అరికడతామన్నారు. గతంలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ తిరుమలరావు వీఆర్‌కు వెళ్లారు.

డక్కిలి ఎస్ఐగా శివశంకర్

డక్కిలి: డక్కిలి ఎస్ఐగా శివశంకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. బాధితులు ఎవరైనా నేరుగా తనని ఆశ్రయించి న్యాయం పొందవచ్చునని తెలిపారు.

వెంకటరెడ్డి సేవలు చిరస్మరణీయం

డక్కిలి: మాజీ ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి సేవలు చిరస్మరణీయమని వెంకటగిరి, సర్వేపల్లి ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మాటుమడుగు గ్రామంలో వెంకటరెడ్డి సంతాప సభ నిర్వహించారు. నెల్లూరు జిల్లా డీపీఓ సుస్మితారెడ్డి, వెంకటగిరి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ దొంతు శారద, ఎంపీపీ గోను రాజశేఖర్, వైస్ ఎంపీపీ గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్ఆర్ సీపీ నాయకులు చింతల శ్రీనివాసులురెడ్డి, ఎం.నారాయణరెడ్డి, బి.భాస్కర్ నాయుడు, శ్రీహరిరెడ్డి, కె.మధురెడ్డి పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎంపిక



అధ్యక్షుడు మైకేల్ బెన్‌హర్‌ను సత్కరిస్తున్న ప్లాస్టర్లు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. పట్టణంలోని బేరిపేటలో ఉన్న సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చి వద్ద గురువారం సాయంత్రం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్ఎం వినయ్‌కుమార్, అధ్యక్షుడిగా ఓ మైకేల్ బెన్‌హర్, ఉపాధ్యక్షుడిగా శరత్‌బాబు, సెక్రటరీగా ప్రేమ్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా సురేష్ పాల్, ట్రెజరర్‌గా మురళీధర్, సలహాదారులుగా ఏసుపాదం, జోసెఫ్ రాజు, సూరిబాబులు, కార్యవర్గ సభ్యులుగా శామ్యూల్, ఐజాక్‌లను ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నట్లు వెల్లడించారు. ఎస్ఏఎల్‌సీ చర్చి వద్ద నూతనంగా ఎంపిక అధ్యక్షుడితోపాటు కార్యవర్గానికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

ముత్యాలమ్మ ఆలయ హుండీ లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

చిల్లకూరు: తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసియున్న ముత్యాలమ్మ ఆలయంలో గురువారం హుండీల లెక్కింపు చేపట్టారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ పర్యవేక్షణలో అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. 81 రోజులకుగాను హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలు రూ.21.70 లక్షలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు తీర్మానం చేసి, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు ఆలయ ఈఓ తెలిపారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చేపట్టే కార్యక్రమాలకు సంబంధించిన సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, చైర్‌పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ, ఆలయ ఈఓ నవీన్‌కుమార్, కమిటీ సభ్యులు డి.చంద్రశేఖర్‌రెడ్డి, చేవూరు శ్రీనివాసులు, బాలు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామివారు

వాకాడు: మండలంలోని కొండూరుపాళెం గ్రామంలో వెలసిన శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ అష్టమ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త సన్నారెడ్డి చంద్రభూషణ్‌రెడ్డి, శైలజ దంపతులు, సన్నారెడ్డి రామచంద్రారెడ్డి, లావణ్య దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రధాన అర్చకుడు గూడలి సుధీర్‌శర్మ ఆలయంలో విశేష ద్రవ్య స్నపన అభిషేకం, మూర్తి హోమం, కలశస్థాపన, పుష్పాలంకరణ, పల్లకీ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టు పక్కల మత్స్యకార గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విజేతగా బాలాయపల్లి క్రికెట్ జట్టు



బహుమతులు స్వీకరిస్తున్న బాలాయపల్లి ఉపాధ్యాయుల జట్టు

బాలాయపల్లి(సైదాపురం): ప్రగతి సేవాసంస్థ గూడూరు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహించిన టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీల్లో బాలాయపల్లి జట్టు రెండోసారి విజయకేతనం ఎగుర వేసినట్లు నిర్వాహకులు తెలియశారు. అల్లూరు శేషారెడ్డి స్టేడియంలో తిరుపతి, నెల్లూరు జిల్లాలకు సంబంధించి టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలను ఈ నెల 28వ తేదీ వరకు నిర్వహించారు. బాలాయపల్లి మండలం జట్టు వరుసగా రెండుసార్లు విజయం సాధించింది. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు.

సెప్టెంబర్ 14న మెగా లోక్ అదాలత్



లోక్ అదాలత్‌పై మాట్లాడుతున్న న్యాయమూర్తి

గూడూరు రూరల్: గూడూరు కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 14న మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఏడో అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం తెలిపారు. కోర్టులో గురువారం పోలీసులు, న్యాయవాదులతో జడ్జి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు జడ్జి పలు సూచనలు ఇచ్చారు. స్టేషన్ల వారీగా కేసులను పరిశీలించి కక్షిదారులు ఇద్దరి పరస్పర అంగీకారంతో లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసేందుకు కృషి చేయాలన్నారు. పోలీసులు, న్యాయవాదులు సమన్వయంతో పని చేసి లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో న్యాయమూర్తి సులోచనరాణి, డీఎస్పీ రమణకుమార్, ఒకటి, రెండో, రూరల్ పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



చిట్టమూరులో మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద ఉపాధ్యాయులు



వాకాడులో గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

వాకాడు: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రమైన వాకాడు గురుకుల పాఠశాల, చిట్టమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టమూరు హెచ్‌ఎం టి.గిరిబాబు మాట్లాడుతూ భారతదేశానికి ఒలింపిక్స్‌లో హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ ఎన్నో పతకాలు సాధించారన్నారు. అనంతరం వాకాడు, చిట్టమూరులో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థుకు మిఠాయిలు పంపిణీ చేశారు.

కుట్టు శిక్షణతో ఆర్థిక స్వావలంబన



సర్టిఫికెట్ అందుకున్న మహిళలు

గూడూరు రూరల్: మహిళలు ఆత్మ విశ్వాసంతో ఆర్థిక స్వావలంబన సాధించేందుకు కుట్టు శిక్షణ కార్యక్రమాలను సంస్థ ద్వారా చేపడుతున్నామని సునీతా సేవా సంస్థ నిర్వాహకులు సారంగం శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని రాజావీధిలోని వారి కార్యాలయంలో గురువారం మూడు నెలల పాటు కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుట్టు శిక్షణ నేర్చుకుని వారి జీవన విధానంలో మార్పులు పొందవచ్చని అన్నారు. అనంతరం సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సారంగం సులక్ష్మీ, మదనంబేటి వెంకటరమణయ్య, లక్ష్మీనారాయణ, పద్మావతి, శిక్షకురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.